సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 31 । మే । 2023





**పెదకడిమిలో భారీ చోరీ**

పెదవేగి మండలం పెదకడిమిలో సోమవారం రాత్రి జరిగిన భారీ చోరీలో రూ.7 లక్షల నగదు, 15 కాసుల బంగారం చోరీ అయ్యాయి. 8లో ▸



**ఆక్వా రైతులకు అండగా**

కైకలూరులో ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సమావేశం జరిగింది. ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. 8లో ▸



**అకాల వర్షంతో అవస్థలు**

మంగళవారం కురిసిన వర్షంతో పలు చోట్ల వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. 8లో ▸

# సంక్షేమ సారథికి నీరాజనం

- ముఖ్యమంత్రిగా జగన్ పాలనా పగ్గాలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి
- అన్ని నియోజకవర్గాల్లో అంబరాన్నంటిన సంబరాలు
- నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు
- తాడేపల్లిగూడెంలో ఉపముఖ్యమంత్రి కొట్టు నేతృత్వంలో వేడుకలు

**సాక్షి ప్రతినిధి, ఏలూరు:** సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనకు జనం నీరాజనం పట్టారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన ఆయన అధికారంలోకి వచ్చాక వాటికి శాశ్వత పరిష్కారం చూపుతానని మాటిచ్చారు. ఇచ్చిన హామీల్ని నూరు శాతం అమలు చేస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సంబరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనగా మిగిలిన నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. చింతలపూడిలో అన్నదానం, తణుకు ప్రభుత్వాసుపత్రిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

**ఏలూరు జిల్లాలో..**

ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, నగర పార్టీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్లు పాల్గొని కేక్ కట్ చేశారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు మండలం వట్లూరులో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నేతృత్వంలో కేక్ కట్ చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు ప్రజలు నీరాజనం పడుతున్నారని, 2024 ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కేక్ కట్ చేశారు. పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేట్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా నేతృత్వంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే కట్ చేశారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు నాలుగేళ్ళ ప్రభుత్వ పాలన పురస్కరించుకుని పార్టీ శ్రేణులతో భారీ సమావేశం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో భీమడోలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు.

**పశ్చిమగోదావరి జిల్లాలో..**

మరో 30 ఏళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆకాంక్షించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేసి అనంతరం మంత్రి ప్రసంగించారు. తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన సంబరాల్లో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం తణుకు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆచంట నియోజకవర్గంలో పోడూరు మండలం తూర్పుపాలెంలో ఆచంట ఎమ్మెల్యే, పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టడంలో చంద్రబాబు మాయల మరాఠీ అని, ఏనాడూ హామీలు అమలు చేయని ఆయన మరోసారి ప్రజలను మభ్యపెట్టడానికి సిద్ధమవుతున్నారని రంగనాథరాజు ఎద్దేవా చేశారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించాయి. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. పాలకొల్లు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ పాల్గొన్నారు. ఉండి మండలం యండగండిలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నాలుగేళ్ల సంబరాలు నిర్వహించారు. పీవీఎల్ కేక్ కట్ చేసి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు తదితరులకు తినిపించారు.



తాడేపల్లిగూడెం అర్బన్: కేక్ కట్ చేసి నాయకులకు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



భీమవరం: పట్టణంలో విజయోత్సవ సంబరాలు



పెనుగొండ: తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కేక్ తినిపిస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: బాలింతలకు పండ్లు అందిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



పాలకొల్లు అర్బన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు



ఉండి: యండగండిలో కేక్ కట్‌చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

## నాలుగేళ్లుగా ఓఎన్జీసీ నిధులు శూన్యం



ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ పి.ప్రశాంతి

**నరసాపురం:** ఓఎన్జీసీ సంస్థ తన కార్యకలాపాల ద్వారా వచ్చే లాభాల్లో కొంతమేర సీఎస్ఆర్ నిధుల రూపంలో ఖర్చు చేస్తుంది. సీఎస్ఆర్ నిధుల అంశంపై మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతిలు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓఎన్జీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత నాలుగేళ్లుగా సంస్థ సీఎస్ఆర్ నిధులు రూపాయి కూడా విడుదల చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందరర్భంగా ముదునూరి మాట్లాడుతూ జిల్లాలో నరసాపురం తీరంలో ఓఎన్జీసీ కార్యకలాపాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కేజీ బేసిన్‌కు సంబంధించి నరసాపురం కేంద్రంగా ఓఎన్జీసీ 40 ఏళ్లుగా వ్యాపారం చేస్తుందని అన్నారు. పేరుపాలెం బీచ్ అభివృద్ధికి, నరసాపురం ప్రధాన పంట కాలువ వెంట రిటైనింగ్ వాల్ నిర్మాణం, బ్యూటిఫికేషన్‌కు సంబంధించి సీఎస్ఆర్ నిధులు అడుగుతూ ప్రతిపాదనలు ఇచ్చామని, ఓఎన్జీసీ సానుకూలంగా స్పందించాలని అన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఓఎన్జీసీ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానికంగా ఏమీ ఖర్చు చేయలేదనే భావన ప్రజల్లో కూడా ఉందన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఓఎన్జీసీ సర్వస్ మేనేజర్ డీఏ సుబ్బరాజు, ఏరియా మేనేజర్ డి.రాజ్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ డి.శ్రీనివాస్, నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## బదిలీలు పారదర్శకంగా జరగాలి

**భీమవరం (ప్రకాశంచౌక్):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను అత్యంత పారదర్శంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశమై గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జిల్లా, అంతర్ జిల్లా బదిలీలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు, ఆరోపణలకు తావు లేకుండా బదిలీ జరిపే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. జూన్ 10 వరకు బదిలీలకు అవకాశం కల్పించామని, జిల్లా పరిధిలో మూడు కేటగిరీల ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయన్నారు. మెడికల్ గ్రౌండ్స్, భార్యాభర్తలు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులైతే, సింగిల్ ఉమెన్ కేటగిరిలో జిల్లా పరిధిలో బదిలీని కోరవచ్చన్నారు. ఇతర జిల్లాలకు వెళ్లాలంటే మాత్రం పరస్పర అంగీకారం, భార్యాభర్తల కేటగిరిలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా పరిధి, అంతర్ జిల్లాల బదిలీలకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు జూన్ 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పక్రియ జూన్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.



సచివాలయ ఉద్యోగుల బదిలీలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

**జిల్లా పరిధిలో షెడ్యూల్ ఇలా..** మే 28న సంబంధిత జిల్లా కార్యాలయాల్లో ఖాళీల వివరాల సమర్పణ. జూన్ 3 వరకు స్వీయ ధ్రువీకరణ వివరాలతో బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 5 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన.. జూన్ 6న వెబ్‌ర్యాంక్ జాబితా ప్రదర్శన, జూన్ 8, 9, 10 తేదీల్లో నియామకపు అథారిటీ కౌన్సెలింగ్.. జూన్ 10 నుంచి ఏవైనా ఫిర్యాదులుంటే జిల్లా కలెక్టర్‌కు చేయవచ్చు.

**అంతర్ జిల్లా బదిలీ కోసం..**

మే 28న సంబంధిత జిల్లా కార్యాలయాల్లో ఖాళీలు వివరాల సమర్పణ. జూన్ 3 వరకు స్వీయ ధ్రువీకరణ వివరాలతో బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 5న హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌కు ప్రతిపాదన పంపుతారు. జూన్ 8 ఆ దరఖాస్తులను కార్యదర్శికి సమర్పిస్తారు. జూన్ 8, 9, 10 తేదీల్లో నియామకపు అథారిటీ కౌన్సెలింగ్ నిర్వహించి, నిర్దిష్ట గ్రామ, వార్డు సచివాలయాన్ని చూపుతూ బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలి. జూన్ 10 నుంచి ఫిర్యాదులుంటే జిల్లా కలెక్టర్‌కు చేయవచ్చు.

## ఆరోగ్యం..ఆహ్లాదం

- వేసవి క్రీడా శిబిరాల్లో విద్యార్థులకు శిక్షణ
- జిల్లాలో 50 శిబిరాల ఏర్పాటు
- 20 క్రీడాంశాల్లో 2,500 మందికి శిక్షణ

**సాక్షి, భీమవరం:** విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి ప్రత్యేక క్రీడా శిక్షణా శిబిరాలు విజయవంతమయ్యాయి. విద్యతోపాటు క్రీడల పట్ల కూడా విద్యార్థుల్ని ఆకర్షితుల్ని చేసేలా ఈ శిబిరాలు నిర్వహించారు. క్రీడల ద్వారా శారీరక ఆర్యోగంతోపాటు ఉపాధి అవకాశాలున్నందున్న ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 50 చోట్ల వివిధ క్రీడల్లో ఉచిత శిక్షణా శిబిరాలు ఏర్పాటుచేయగా దాదాపు 2,500 మంది శిక్షణ పొందుతున్నారు. జిల్లా చీఫ్ కోచ్ ఎం.సురేష్ బాబు పర్యవేక్షణలో 50 మంది క్యాంప్ ఇన్‌చార్జ్‌లను నియమించి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

**జిల్లాలోని శిక్షణా కేంద్రాలు ఇవే**

జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే క్రీడా శిక్షణ భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాలతోపాటు మార్టేరు, వీరవాసరం, ఇరగవరం, పెనుగొండ, అత్తిలి, పెనుమంట్ర, శృంగవృక్షం, ప్రత్తిపాడు, నవుడూరు, కలిసిపూడి తదితర గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు అలాగే సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.


**శిక్షణ ఇచ్చే క్రీడాంశాలు..**

జిల్లాలో 50 శిక్షణాకేంద్రాలు ఏర్పాటుచేయగా ఒక్కో చోట ఒక్కో క్రీడలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఏ క్రీడ పట్ల మక్కువ ఉంటే అదే క్రీడలో శిక్షణ పొందవచ్చు. శిక్షణ ఇచ్చే క్రీడల్లో ఆర్చరీ, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, బాక్సింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, రోప్ స్కిప్పింగ్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, వాలీబాల్, యోగా వంటి 20 క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం ఆయా పాఠశాలల్లో నిర్వహించే వివిధ పోటీల్లో పాల్గొనడంతోపాటు ఇతర ప్రాంతాల్లో నిర్వహించే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా ఫిజికల్ డైరెక్టర్లు కృషిచేస్తారు.



మల్లఖంబ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

**జూన్ 10 వరకు క్రీడల్లో ఉచిత శిక్షణ**



స్కూళ్లకు వేసవి సెలవులు ఇచ్చిన తరువాత వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. దీనికిగాను అర్బన్ ప్రాంతాల్లో 32, రూరల్ ఏరియాల్లో 18 శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శిక్షణా కేంద్రంలో ప్రత్యేకంగా క్యాంప్ ఇన్‌చార్జ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. జిల్లాలోని 50 శిక్షణా శిబిరాల్లో సుమారు 2,500 మంది శిక్షణ పొందుతున్నారు.

– ఎం సురేష్‌బాబు, చీఫ్ కోచ్, పశ్చిమగోదావరి జిల్లా

## న్యూస్‌రీల్

### ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కొప్పర్రులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

**మొగల్తూరు:** గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలోని పెదపేటలో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరినీ ఆరోగ్యవంతుల్ని చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని, లేవలేని స్థితిలో ఉన్న రోగులను గుర్తించి స్వయంగా వారి ఇంటికి వెళ్ళి పరీక్షించి తగు సలహాలు సూచనలు అందచేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుందని, అందులో భాగంగానే ప్రతి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్‌తో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న డాక్టర్, సిబ్బందితో మాట్లాడి రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్, ఎంపీడీవో ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

### రిసార్టుల కోసం స్థల పరిశీలన



కేపీ పాలెంలో రిసార్టుల రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

**మొగల్తూరు:** కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే తీరప్రాంతంలో బ్లూఫాగ్ బీచ్ ప్రాజెక్టు, గోల్డ్‌కోస్టు రిసార్ట్స్, బీచ్ రిసార్ట్స్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డి కేపీ పాలెం, పేరుపాలెంలోని తీర ప్రాంతంలో పర్యటించారు. రిసార్టుల నిర్మాణం కోసం అవసరమైన 66 ఎకరాలకు సంబంధించిన రికార్డులను స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.అనితా కుమారి, సర్వేయర్ ఏ.ధనరాజు తదితరులున్నారు.

### మళ్లీ ఆచంట నుంచే పోటీ

**కార్యకర్తలకు శ్రీరంగనాథరాజు భరోసా**



**పెనుగొండ:** ఆచంట నుంచి నూటికి నూరు శాతం పోటీ చేస్తున్నామని, విజయం సాధిస్తా మని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సీఎం జగన్‌ను మరోసారి సీఎం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎంగా జగన్ పాలన చేపట్టి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీని తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని తిప్పికొట్టారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచి విజయం సాధించి మరోసారి మంత్రి పదవిని చేపట్టబోతున్నామని చెప్పారు. నాలుగేళ్లలో ఆచంట నియోజకవర్గంలో రూ.601 కోట్ల అభివృద్ధి పనులు చేశామని.. దీంతో పాటు రూ. 1153 కోట్లు అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమచేశామన్నారు. అభివృద్ధిపై దుష్ప్రచారం చేస్తున్నారని.. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజలకు మరింత చేరువ అయ్యామన్నారు. వరదల్లోనూ, కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచామని, గత ప్రజా ప్రతినిధులు ఏనాడైనా పైసా విదిల్చారా అని ప్రశ్నించారు.

### క్యూమర్ మిషన్ అదృశ్యం

**పోలవరం రూరల్:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో క్యూమర్ మిషన్ మాయమైనట్లు ప్రాజెక్టు డిప్యూటీ మేనేజర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో క్యూమర్ మిషన్‌తో పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.45 లక్షల విలువైన మిషన్‌పై హేమంత్‌రాజ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేనేజర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## క్లుప్తంగా

### వైభవంగా మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు, పండితులు అమ్మవారి మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ నవకలశ స్నపన నిర్వహించారు. అనంతరం శ్రీ చక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలను, ఆ తరువాత పూర్ణాహుతి వేడుకను నేత్రపర్వంగా జరిపారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు అచంట అనసూయ, సురేష్ దంపతులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

### జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో మెరిసిన యువకుడు




ఐసీఎన్ శరీరాకృతి పోటీలో 5వ స్థానం సాధించిన పాటిబండ్ల అభిషేక్

జంగారెడ్డిగూడెం: ఐ కంపీట్ నేచురల్ నేషనల్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జంగారెడ్డిగూడెం గోల్డెన్ జిమ్ స్టూడెంట్ పాటిబండ్ల అభిషేక్ జాతీయ స్థాయిలో ఐదో స్థానం సాధించాడు. ఈ నెల 27న జాతీయ స్థాయిలో ముంబైలో జరిగిన శరీరాకృతి పోటీల్లో అభిషేక్ పాల్గొని ప్రతిభ కనపరిచాడు. అభిషేక్ ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి సులోచన లక్కవరం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా, తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు.



ముదినేపల్లి రూరల్ : వడాలిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



కాళ్ల : కాళ్ల శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారిపై భారీగా చేరుకున్న నీరు



కాళ్ల : కాలువను తలపిస్తున్న కాళ్లలోని పల్లపువీధి

## అకాల వర్షం.. రోడ్లు జలమయం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల మంగళవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. – ముదినేపల్లి రూరల్/కాళ్ల

## ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వం




ఆక్వా రైతుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, సంఘ నాయకులు

- ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ
- కైకలూరులో ఆక్వా రైతుల కీలక సమావేశం

కై కలూరు: ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సమావేశం మంగళవారం జరిగింది. సంఘ కార్యనిర్వాహక సభ్యుడు, మండవల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆక్వా ఉత్పత్తులలో 5 శాతం రిబేటు, ఫంగసీస్ చేపల చెరువుల్లో కోడి వ్యర్థాల సాగు వల్ల ఆక్వా రంగానికి వస్తున్న చెడ్డపేరు వంటి అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల విక్రయాలలో 5 శాతం రిబేటును ట్రేడర్స్‌కు ఇవ్వడం వల్ల సాగు రైతులు నష్టపోతున్నారన్నారు. ఇదే విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించాలనే ఉద్దేశంతో ఫంగసీస్ చేపల రైతులు కొందరు కోడి వ్యర్థాలను చెరువులలో మేతగా వినియోగిస్తున్నారన్నారు. కైకలూరు పరిసర ప్రాంతాల్లో దాదాపు 20 మంది రైతులు వీటిని వినియోగిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రహదారులపై కోడి వ్యర్థాల వాహనాలు వెళ్లినా, రైతులు చెరువుల్లో వీటిని వినియోగిస్తున్నట్లు తెలిసినా అసోసియేషన్‌కు చెందిన 63015 46464 (భాస్కరరావు) సెల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ తాను 1994 నుంచి ఆక్వా రైతుగా ఉన్నానన్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా రైతుల ఉత్పత్తులు సాగు చేపట్టాలన్నారు. ఫంగసీస్ చేప కేజీ ధర గతంలో రూ.110 నుంచి నేడు రూ.75కు పడిపోయిందన్నారు. కోడి వ్యర్థాల వినియోగం వల్ల మొత్తం ఆక్వా రంగానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా రంగ సమస్యలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందిస్తామన్నారు. అనంతరం సీఎన్నార్ గార్డెన్ సమీపంలోని అసోసియేషన్‌కు చెందిన 16 సెంట్ల భూమిలో భవన నిర్మాణం నిమిత్తం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సంఘ రైతులు పరిశీలించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు జంపన రామలింగరాజు, ట్రెజరర్ గాదిరాజు సుబ్బరాజు, జాయింట్ సెక్రటరీ పెన్మత్స బోసురాజు, ఈసీ సభ్యుడు రవి, చేపల మేతలకు సంబంధించి గ్రోవెల్స్ నరేంద్ర, ఆనంద రుద్రరాజు మురళీ, యానో నవీన్, రైతులు చదలవాడ శేషగిరిరావు, దూలం వినయ్, శ్యామ్, చందన ఉమామహేశ్వరరావు, సయ్యపురాజు గుర్రాజు, ఏతఈ శ్రీనివాస్, ఉమా శంకరరెడ్డి, సుబ్రహ్మణ్యం, భాస్కరవర్మ, గుడివాడ, భీమవరం, ఏలూరుకు చెందిన ఆక్వా రైతులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే యువతకు ఉద్యోగాలు



చింతలపూడి జాబ్‌మేళాలో ఆఫర్ లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, జేసీ లావణ్య వేణి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జాబ్‌మేళాలో 247 మందికి ఉద్యోగాలు

చింతలపూడి: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (సీడాప్), జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యంపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వమన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందటానికి అభ్యర్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని సూచించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే సుమారు నాలుగు లక్షల సచివాలయ, వలంటీర్ పోస్టులను భర్తీ చేసి సీఎం వైఎస్ జగన్ యువతకు ఉపాధి కల్పించారని కొనియాడారు. జేసీ లావణ్యా వేణి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు మానవ వనరుల కొరత ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ కాస్కేడింగ్ సిస్టం ద్వారా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్కిల్ హబ్ ద్వారా, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్కిల్ కళాశాల ద్వారా, రాష్ట్ర స్థాయిలో స్కిల్ యూనివర్సిటీ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జాబ్ మేళాకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలలో పాల్గొనాలన్నారు. అనంతరం వివిధ కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజి మాట్లాడుతూ జాబ్ మేళాకు 20 కంపెనీలు ప్రతినిధులు రాగా, మొత్తం 645 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 247 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో 79 మందిని ఫైనల్ ఇంటర్వ్యూ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జెడ్పీటీసీ సభ్యులు ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, సీడాప్ జేడీఎం కె.పార్థసారథి, ఎంప్లాయ్‌మెంట్ అధికారి ప్రవీణ్, సెట్‌వెల్ సీఈఓ మెహరాజ్, మేనేజర్ పి సత్యన్నారాయణ, ఏపీఎస్‌ఎస్‌డీసీ సిబ్బంది ప్రవీణ్, కిషోర్, రాంబాబు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుడు

చింతలపూడి: విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడిశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన తెల్లమేకల అరవింద్ (21) విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కోసం లైన్‌మెన్ సహాయకునిగా పట్టాయిగూడెంలో పనికి మంగళవారం వెళ్లాడు. గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అవడంతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అరవింద్‌కు ఇంకా వివాహం కాలేదు. కుటుంబానికి ఆసరా అయిన కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్‌శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం పోయిందని ఆరోపించారు. ఎస్సై హరికృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### పోస్టాఫీసు పథకాలపై అవగాహన పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.బాలసుబ్రహ్మణ్యం

పెనుమంట్ర: పోస్టాఫీసు పొదుపు పథకాలపై మహిళల్లో అవగాహన కల్పించడానికి తపాలా సిబ్బంది కృషి చేయాలని భీమవరం పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం పెనుమంట్ర సబ్‌పోస్టాఫీసు వద్ద కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ ఖాతాలపై సిబ్బందికి అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోస్టాఫీసుల ద్వారా ఖాతాదారులు తమ ఇంటి నుంచే తమ లావాదేవీలు నిర్వహించుకునేలా మార్పులు తీసుకువచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అన్నిరకాల సేవలను ఇంటి వద్దకు చేరువ చేస్తున్నారన్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ ద్వారా మహిళలకు 7.5 శాతం వడ్డీతో రెండేళ్ల కాలపరిమితి కలిగిన పొదుపు ఖాతాలను ప్రవేశపెట్టిందని, ఈ ఖాతా ద్వారా ప్రతి మహిళా రూ.1000 నుంచి రూ.2 లక్షల వరకూ డిపాజిట్ చేసుకోవచ్చన్నారు. ఈ ఖాతాను 18 ఏళ్లు నిండిన మహిళలు, బాలికల పేరున ఖాతాను తెరవవచ్చన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తణుకు సబ్‌డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ టి.సుబ్రహ్మణ్యం, పెనుమంట్ర సబ్‌పోస్ట్ మాస్టర్ ఎస్.శ్యామ్‌సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

## పెదకడిమిలో భారీ చోరీ

రూ.7లక్షల నగదు, 15 కాసుల నగలు అపహరణ



క్రైమ్‌సీన్‌లో ఆధారాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్స్ పోలీసులు, సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్ : పెదవేగి మండలం పెదకడిమి గ్రామంలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగి రూ.7 లక్షల నగదు, 15 కాసుల బంగారం ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెదకడిమి రామాలయం వీధిలో చల్లగొళ్ళ మల్లేశ్వరరావు నివాసం ఉంటున్న ఇంట్లో పైఅంతస్తు గదిలో నిద్రిస్తున్నారు. సోమవారం రాత్రి ఇదే గదిలో కప్‌బోర్డులో పెట్టిన రూ.7 లక్షల నగదు, బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి నగదు, బంగారం కనిపించకపోవడంతో బాధితుడు మల్లేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీఎస్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్స్ ఎస్సై శ్రీనివాసరావు, రాధాకృష్ణ, పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాల కోసం వెతికారు. త్వరలో నిందితులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీ చేస్తామని సీఐ మురళీకృష్ణ చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బ్యాంక్‌లో ఉరి వేసుకుని స్వీపర్ ఆత్మహత్య

నిడమర్రు: పత్తేపురం సెంట్రల్ బ్యాంక్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు మంగళవారం ఉదయం బ్యాంక్ స్టోర్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌చార్జ్ ఎస్సై కె.స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదనింద్రకొలనుకు చెందిన ఉదయగిరి వెంకట నాగసాయి బద్రిగుప్తా (22) పత్తేపురం సెంట్రల్ బ్యాంక్‌లో స్వీపర్‌గా నాలుగేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. రోజులాగే ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బ్యాంక్‌కు వెళ్లిన వెంకటసాయి బ్యాంక్ స్టోర్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు తండ్రి శ్రీనివాసరావుకు విషయం తెలుపగా కార్యాలయానికి వచ్చి తన కుమారుడు చనిపోయినట్లు నిడమర్రు పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. ఓ బాలికను ప్రేమించాడని, ఆమె తిరస్కరించడంతో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉండవచ్చని స్నేహితుల ద్వారా తెలుసుకున్నట్లు శ్రీనివాసరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వినాయక్ చెప్పారు.

## సహజ వనరుల పరిరక్షణ అందరి బాధ్యత

- పోలవరం ఎస్ఈ నరసింహమూర్తి
- మిషన్ లైఫ్‌పై అవగాహన కార్యక్రమం



పోలవరం ప్రాజెక్టు స్థలంలో మొక్క నాటుతున్న పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ నరసింహమూర్తి

పోలవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి, సహజ వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎస్ఈ కె.నరసింహమూర్తి అన్నారు. మంగళవారం పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు స్థలంలో జలవనరుల అభివృద్ధి శాఖ, మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)ల సమన్వయంతో అటవీశాఖ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్‌పై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ‘మిషన్ లైఫ్’ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైఫ్ అంటే పర్యావరణానికి జీవనశైలి అన్నారు. పర్యావరణ సంరక్షణకు నీటిని ఆదా చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పటం, ఈ–వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఆహార పద్ధతులను అనుసరించటం, వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం వంటి థీమ్‌లతో వ్యక్తులు, సంఘాలు అమలు చేసేందుకు 75 కీలక చర్యలను తీసుకోవాలని మిషన్ స్పష్టం చేస్తోందన్నారు. 2022–28 కాలంలో పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం వ్యక్తిగత, సామూహిక చర్య తీసుకోవడానికి ఒక బిలియన్ భారతీయులు, ఇతర ప్రపంచ పౌరులను సమీకరించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఇందులో భాగంగా, 2028 నాటికి 80 శాతానికి పైగా గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు పర్యావరణ అనుకూలమైనవిగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పోలవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దావీదు రాజునాయుడు మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు, ప్లాంటేషన్లు, ప్లాస్టిక్ క్లీన్ అప్ కార్యక్రమాలతో సహా పదివేలకు పైగా కార్యక్రమాలను నిర్వహించాలని ఏపీ అటవీశాఖ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఇందులో భాగంగా, పాపికొండలు నేషనల్ పార్క్, గోదావరి నది, పాపికొండలు టూరిజం, బోటింగ్ పాయింట్లలో, స్థానిక మత్స్యకారులు నివసించే ప్రాంతాల్లో ప్లాస్టిక్ క్లీన్ అప్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు సీఐ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, భవిష్యత్ తరాల మనుగడ కోసం వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. జలవనరుల శాఖ, ఎంఈఐఎల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 89 శాతం హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఐదో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 69 కేంద్రాల్లో 16,326 మంది విద్యార్థులకు 14,541 మంది హాజరు కాగా, 1,785 మంది గైర్హాజరయ్యారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ–1, కామర్స్–1, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ–2, కామర్స్–2 పరీక్షలు నిర్వహించారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 3,260 మంది జనరల్ విద్యార్థులకు 2,986 మంది హాజరు కాగా 274 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 512 మందికి 373 మంది హాజరు కాగా, 139 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 5,923 మంది జనరల్ విద్యార్థులకు 5,484 మంది హాజరు కాగా 439 మంది గైర్హాజరయ్యారు. 551 మంది ఒకేషనల్ విద్యార్థులకు 400 మంది హాజరు కాగా, 151 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 1,684 మంది జనరల్ విద్యార్థులకు గాను 1,582 మంది హాజరు కాగా, 102 మంది గైర్హాజరయ్యారు. 252 మంది ఒకేషనల్ విద్యార్థులకు 163 మంది హాజరు కాగా, 89 మంది గైర్హాజరయ్యారు.

ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 1,145 మంది జనరల్ విద్యార్థులకు 996 మంది హాజరు కాగా, 149 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 334 మందికి 257 మంది హాజరు కాగా, 77 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 1,842 మంది జనరల్ విద్యార్థులకు 1,625 మంది హాజరు కాగా, 217 మంది గైర్హాజరయ్యారు. 267 మంది ఒకేషనల్ విద్యార్థులకు 199 మంది హాజరు కాగా, 68 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 447 మంది జనరల్ విద్యార్థులకు 394 మంది హాజరు కాగా, 53 మంది గైర్హాజరయ్యారు. 109 మంది ఒకేషనల్ విద్యార్థులకు 82 మంది హాజరు కాగా, 27 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు చెప్పారు.

## కూలిన వంతెన శ్లాబు



వంతెనను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజీ

మొగల్తూరు: జగన్నాథపురం గ్రామం వెళ్లేందుకు కాళీపట్నం ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన మంగళవారం కూలిపోయింది. సుమారు 40 ఏళ్ల క్రితం మూడు గడ్డర్లతో వంతెన నిర్మించగా, జగన్నాథపురం, పాతపాడు వెళ్లేందుకు ఈ వంతెనే ఆధారం. ఆయా గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండటంతో భారీ వాహనాలు నిత్యం వందలాదిగా ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో మంగళవారం భారీ చేపల లోడుతో వెళుతున్న లారీ ఈ వంతెన మీదుగా వెళుతుండగా వంతెన శ్లాబు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో లారీ ఓ వైపు ఒరిగిపోగా, దీనిని అధికారులు బయటకు లాగించారు. వంతెన మీదుగా రాకపోకలను నిషేధించి, దారితిప్ప మీదుగా వాహనాలను దారి మళ్లించామని ఆర్అండ్‌బీ ఏఈ నిక్కీక్రజ్ చెప్పారు. శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి రూ.1.50 కోట్లతో వంతెన పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ వంతెన కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొయ్యూరు రైల్వే గేటు సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఒక వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు. గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటన జరిగి సుమారుగా నెల రోజులు కావచ్చని, మృతదేహం పురుగులు పట్టి, అస్థిపంజరంలా ఉందని, మృతదేహంపై నలుపు రంగు లోయర్ మాత్రమే ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కూలిన విద్యుత్ స్తంభం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో మంగళవారం వాతావరణం చల్లబడి, ఈదురుగాలులు వీచాయి. లక్కవరంలో ఈదురుగాలులు, వర్షం కురిసింది. గాలులకు విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్టు నేలకొరిగాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

# నాలుగేళ్ల పాలన దేశానికే ఆదర్శం

**తాడేపల్లిగూడెం అర్బన్ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన నవశకానికి నాంది పలికిందని ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రి కొట్టు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు గడిచిన కారణంగా కేక్‌ను కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచారు. ముప్పిడి సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొట్టు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేలు ఎన్నికలు వచ్చిన సందర్భంలో ప్రజల వద్దకు వెళ్లాలంటే భయపడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజలకు వద్దకు వెళ్తుంటే వారిని తమ బంధువులుగా స్వాగతం పలుకుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై గడపగడప కార్యక్రమంలో ప్రజలే ఎదురొచ్చి సంతోషంగా జీవనం సాగిస్తున్నామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. పథకాల ప్రభావంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తల ఎత్తుకొని తిరుగడం గర్వకారణమన్నారు. మంత్రి వర్గం ఏర్పాటు నుంచి నామినేటెడ్ పదవులను బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు 50శాతం కేటాయిస్తూ సామాజిక న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కైగాల శ్రీనివాసరావు, గుండుమోగుల సాంబయ్య, గుండుబోగుల నాగు, జడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, రెడ్డి సత్తిబాబు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, తమ్మిశెట్టి చుక్కయ్య, షేక్ నాషద్, బొద్దు సాయిబాబా, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం : సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

**పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్**

**తణుకు అర్బన్:** పేద మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తణుకు పార్టీ కార్యాలయంలో మంగళవారం కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి సంక్షేమం, అభివృద్ధి సమృద్ధిగా అందిస్తూ యావత్ దేశం ఏపీవైపు చూసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో నేరుగా ప్రజల కష్టాలను చూసిన ఆయన వాటిని నెరవేర్చడంలో సఫలీకృతులయ్యారని స్పష్టం చేశారు.

**పండ్లు పంపిణీ..**

ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూరైన సందర్భంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని బాలింతలు, రోగులకు ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, పార్టీశ్రేణులు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, మంగెన సూర్య, యిందుగపల్లి బలరామకృష్ణ, జంగం ఆనంద్‌కుమార్, నత్తా కృష్ణవేణి, షేక్ బాజీ, కుడుపూడి చంద్రరావు, ములగాల శ్రీనివాసు, కారుమంచి యోహాన్, రేలంగి రాంబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం జగన్**

**అత్తిలి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తూ దేశంలోనే ముఖ్యమంత్రులందరిలోను మేటి ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారని అత్తిలి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అత్తిలి పార్టీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల సృష్టికర్తగా జగనన్న అందరి హృదయాల్లోను స్థానం సంపాదించారని స్పష్టం చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ హబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు పాల్గొన్నారు.

ఇరగవరం: నేటితో సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇరగవరంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాదా యాత్ర చేసి ప్రజల కష్టలు తెలుసుకుని వాటిని తీర్చడమే లక్ష్యంగా కొనసాగుతున్నా సీఎం జగన్ పరిపాలనకు నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 నియోజకవర్గల్లో గెలుపొందే దిశగా అడుగులు వేస్తున్నా జగనన్నకు ప్రజలందరు తోడుండాలన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, అందించి అందరి మన్ననలు పొందరాని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీను, సొసైటి అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, పాలా పాలేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి సత్యన్నారాయణ, జక్కంశెట్టి రాంబాబు, వీరవల్లి యుగంధర్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


తణుకు : పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, గుబ్బల తమ్మయ్య తదితరులు


అత్తిలి : పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ, తదితరులు


ఇరగవరం : కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి హైమావతి, తదితరులు

**పెంటపాడు:** మండలంలో అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి కోరారు. మంగళవారం పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో జగనన్న ఇళ్లు పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పూర్తయిన ఇళ్లకు విద్యుత్ సౌకర్యంతో పాటు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేస్తేనే అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఆ దిశగా రానున్న కాలంలో ఈ ప్రభుత్వ కాలంలో ప్రజలు పూర్తి సంతృప్తి చెందేలా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె అధికారులకు సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలలో మౌలిక వసతుల కల్పనకు పంచాయతీలు కృషి చేయాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో వికలాంగులు, బాలల సమావేశాలు, నిర్వహించి వారి అవసరాలు తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచుకోవాలన్నారు. తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణలు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ డీఈ ప్రసాద్, అధికారులు వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, పంచాయతీ రాజ్ నవీన్, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, పలు శాఖల ఏఈలు పార్థసారథి, పెద్దిరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శంకరమఠంలో రెండో రోజు ఆలయ శిఖర ప్రతిష్ఠ ఉత్సవం


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గోవిందానంద సరస్వతి స్వామిజీ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని శంకరమఠంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం రెండోవ రోజు వైభవంగా నిర్వహించారు. శిఖరానికి జలాదివాసం, క్షీరాదివాసం కార్యక్రమాలు జరిగాయి. యోగశాల ప్రవేశం, సూర్య నమస్కారాలు, వేద పారాయణం, శంకరాచార్య స్వామికి అర్చనలు, అభిషేకాలు, సర్వమంగళ అమ్మవారికి కుంకుమార్చనలు, ఉమామౌళీశ్వరస్వామికి, యోగ లింగేశ్వర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. పంపా క్షేత్రం పరమహంస పరివ్రాజకాచార్య గోవిందానంద సరస్వతి స్వామీజీ శంకరమఠంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న సంగీత కచేరీ


బీవీఆర్ కళాకేంద్రంలో సంగీత కచేరి దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** సాహితవేత్త భారతం శ్రీమన్నారాయణ సహస్ర చంద్రదర్శన మహోత్సవాలు సందర్భంగా పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో మంగళవారం సాయంత్రం బెంగుళూరుకు చెందిన వి.అపర్ణ సంగీత గాత్ర కచేరీ నిర్వహించారు. బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు. సంగీత కచేరీలో వెలన్ అంబటిపూడి కామాక్షి (విజయవాడ), మృదంగం పెరవలి జయభాస్కర్ (హైదరాబాద్), ఘటం సరస్వతుల హనుమంతరావు (బోడపాడు)లు సహకరించారు.

### టీబీఆర్ విద్యార్థులకు ఎన్‌సీసీ ధృవపత్రాల అందజేత


సైనిక శిక్షణ పూర్తి చేసుకొన్న విద్యార్థులకు ధృవపత్రాలు అందిస్తున్న దృశ్యం

**పెంటపాడు:** విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి పూరితంగా ఉండాలని సైనిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు తనబుద్ది భోగేశ్వర రావు తెలిపారు. అలంపురం టీబీఆర్ సైనిక స్కూల్లో సోమ, మంగళవారాల్లో సైనిక శిక్షణ పూర్తి చేసుకొన్న విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్నల్ ఏకే రాయ్, సైనిక సంక్షేమ సంఘ నాయకులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పద్మావతి, శ్రీనివాస కల్యాణోత్సవం


తణుకులో శ్రీనివాస కల్యాణోత్సవం దృశ్యం

**తణుకు టౌన్:** శివ కేశవ భక్త బృందం ఆధ్వర్యంలో పద్మావతి, శ్రీనివాస కల్యాణోత్సవం మంగళవారం తణుకులో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం తణుకులోని గమిని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి, వెంకట రమేష్‌లు వేద పండితుల మంత్రోచ్చరణలతో ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**తాడేపల్లిగూడెం రూరల్:** గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ ఒక యువకుడు మృతి చెందిన సంఘటనపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన దూలపల్లి వెంకటేష్(29) గత కొంతకాలంగా బ్లడ్ షుగర్, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అయితే, ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు కడుపు నొప్పి తాళలేక గడ్డి మందు తాగాడు. దీంతో అతనిని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు.

# కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

**తణుకు టౌన్:** గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు రిసోర్సు పర్సన్ పీ త్రిపుర సుందరి ఆధ్వర్యంలో అబాకస్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలును నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్ బిజినెస్, అంత్యాక్షరి వంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో కథలు చెప్పడం, యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.


తణుకు మహిళా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు


విద్యార్థులకు సూచనలు చెబుతున్న ఎస్.సాల్మన్‌రాజు

**విద్యార్థులు భాషలపై పట్టు సాధించాలి**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** నేర్చుకోవాలనే ఆసక్తి, పట్టుదల ఉంటే తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు సులువుగా వస్తాయని, భాషలపై పట్టు సాధించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రాడ్-1 గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన తరగతులు 22వ రోజు అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆహ్లాదకరంగా నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు ప్రత్తి వీరాస్వామి సోషల్ స్టడీస్, విశ్రాంత ఎంఈఓ ఎన్. సాల్మన్‌రాజు ఇంగ్లీషు కథలు, గ్రామర్‌తో పాటు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం విషయమై చెబుతూ పొగాకు తీసుకోవడం వల్ల అనర్థాలను వివరించారు. మహాశివభట్టు లక్ష్మణరాజుచే తెలుగులో దేశభక్తి గీతాలు, పద్యాలు చెప్పారు.

## వరి రైతుకు ఆదిలోనే హంసపాదు

**తాడేపల్లిగూడెం రూరల్:** ఖరీఫ్ సాగు ప్రారంభ దశలోనే హంస పాదు అన్నట్టుగా వర్షాలు రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. తాడేపల్లిగూడెం మండలంలో బోర్లపై సాగు కావడంతో ముందుగా నారుమడి పోయడం, నాట్లు వేయడం చేస్తుంటారు. ఈ క్రమంలోనే ముందుగా మాసూళ్లు పూర్తయిన గ్రామాల్లో నారుమడి పోసి నాట్లు వేసేందుకు సిద్ధం చేశారు. అయితే, గత రెండు రోజులుగా తాడేపల్లిగూడెం మండలంలో కురుస్తున్న వర్షాలకు దండగర్ర, అమృతపురం, ఇటుకులగుంట, మోదుగ గుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో నారుమడి నీట మునిగింది. సోమ, మంగళవారాలు కురిసిన వర్షానికి దండగర్ర, అమృతపురం గ్రామాల్లో నారు తిరగబడింది. వర్షపు నీటిలో ఎక్కువ కాలం నారు నిల్వ ఉంటే నారు దెబ్బతినే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రైతులు నారును కాపాడుకునేందుకు నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఖరీఫ్ సాగు తొలినాళ్లల్లోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయని చెప్పక తప్పదు.


తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంట గ్రామంలో వర్షాలకు నీట మునిగిన నారుమడి

## 68,355 టన్నుల ధాన్యం కొనుగోలు

**తాడేపల్లిగూడెం రూరల్:** తాడేపల్లిగూడెం మండలంలో 6,575మంది రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా 68వేల 355 టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 98 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. పట్టెంపాలెం, నీలాద్రిపురం గ్రామాల్లో వరి నారుమడులను ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్.ప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని తెలిపారు. మండల వ్యాప్తంగా 10వేల 872 హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనాగా పేర్కొన్నారు. ఈ సీజన్‌కు 543 హెక్టార్లలో వరి నారుమడి అవసరమవుతుందని, ఇప్పటి వరకు 206 హెక్టార్లలో నారుమడి పడిందన్నారు. ముందస్తు సాగుకు గోదావరి కాలువ ఆయకట్టు రైతులు నారుమడి పోయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇదిలా ఉంటే, జూన్ 2వ తేదిన గుంటూరులో వ్యవసాయ పరికరాలకు సంబంధించి మెగా మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గూడెం మండలంలో ఐదు ట్రాక్టర్లు, మూడు కోత మిషన్లు, పెంట పాడు మండలానికి సంబంధించి రెండు ట్రాక్టర్లు, మూడు కోత మిషన్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు.


పట్టెంపాలెం గ్రామంలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏడీఏ మురళీకృష్ణ

## వలంటీర్ల సేవలు అభినందనీయం


తాడేపల్లిగూడెంలో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ప్రభుత్వ సంక్షేమాలను ప్రజలకు అందించేందుకు వీలుగా వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని వార్డు ఇంచార్జులు కర్రి సుధాకర్ రెడ్డి, చింతకాయల సత్యనారాయణ, పచ్చిపాల శివశంకర్, సొలసు లక్ష్మిలు కొనియాడారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో 8,26,27,29 వార్డులకు సంబంధించి వలంటీర్లుకు వందనం కార్యక్రమం మంగళవారం మునిసిపల్ ఏఎస్‌ఓ కొడవటి సురేష్ అధ్యక్షతన జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది.ఈ సందర్భంగా వార్డు ఇంచార్జ్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు వీలుగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని, వారు చురుకుగా పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు ఉంటూ సచివాలయాలు ద్వారా ఎన్నో సర్వీసులను ప్రజలకు అందిస్తున్నారన్నారు. వృద్ధులకు తెల్లవారుజాము నుంచే పెన్షన్‌లు అందజేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగానే వలంటీర్లు వ్యవస్థ చక్కగా పనిచేస్తుందని కితాబు ఇచ్చారు. కోవిడ్ వంటి ప్రతికూల సమయంలో కూడా వలంటీర్లు ప్రాణాలు లెక్కచేయకుండా సేవలు అందించారని కొనియాడారు. వలంటీర్స్ వందనం కార్యక్రమం ద్వారా 30 మందికి సేవ మిత్ర పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, సచివాలయం అడ్మిన్‌లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

### వాహనం వేలం

**ఇరగవరం:** మండలంలోని ఇరగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన సుజీకి యాక్సిస్ మోటర్ సైకిల్ బుధవారం పోలీస్ స్టేషన్ వద్ద వేలం నిర్వహించడం జరుగుతుందని ఇరగవరం ఎస్సై కె చంద్రశేఖర్ తెలిపారు. ఆసక్తి గల వారు ఈవేలం పాటలో పాల్గొవాలని తెలిపారు. వేలానికి హజరు అయ్యే వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్టు సైజు ఫోటోతో హజరు కావాలని తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు ఐక్యపోరాటాలే శరణ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం రంగం ప్రైవేటీకరణ, కార్మిక చట్టాలను కాలరాయడం చేస్తోందని, వాటిని కాపాడుకోవడానికి ఐక్యపోరాటాలే శరణ్యమని సీఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణలు తెలిపారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.దేశంలో వివిధ కార్మిక సంఘాల్ని ఏకం చేసి ఐక్య పోరాటాలు నిర్వహించడంలో సీఐటీయూ ముందు ఉందని అన్నారు. కార్యక్రమంలో సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, జవ్వాది శ్రీను, మడక రాజు, కార్మికులు పాల్గొన్నారు.


అపరాలు మార్కెట్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కర్రి నాగేశ్వరరావు

## 3న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ డ్రైవ్

**సాక్షి, భీమవరం :** నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూన్ 3వ తేదిన జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీనివాసరాజు, జిల్లా ఉపాధిఅధికారి సి మధుసూదనరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో హీరో మోటార్‌కార్ప్, సీఈటీసీ సోలార్, కుశలవ హౌండ్ వంటి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెల్ 93935 75353 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మీనవిల్లూరు జెడ్పీస్కూల్లో 2002-03లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు

**పెంటపాడు:** పెంటపాడు మండలం మీనవిల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత విద్యార్థులంతా కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అప్పటి పాఠశాల హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు అప్పారావు, వెంకటరత్నం, అరుణ, జానకి, సత్యనారాయణరెడ్డి, నాగభూషణం, నాగేశ్వరరావు, ఆత్మలింగం, తదితరులను ఘనంగా సన్మానించారు.

## పాస్టర్లకు సేవా సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం


తణుకులో జరిగిన పాస్టర్ల అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**తణుకు టౌన్:** దేవుని సేవ చేస్తున్న క్రైస్తవ పాస్టర్లను రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సత్కరించేందుకు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆలోచన మేరకు రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో అమలు చేయనున్నట్లు తణుకు నియోకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. సోమవారం తణుకులో నిర్వహించిన సమావేశం వివరాలను తెలిపారు. 5, 15, 25 సంవత్సరాల అనుభవం ఉన్న వారు ఈ పురస్కారానికి అర్హులని తెలిపారు. జూలై నెలలో తణుకులో క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ జరిగే కార్యక్రమంలో ఈ సత్కారాలను అందజేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో తణుకు యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ మనోజ్ బాబు, కార్యదర్శి బ్లెస్సింగ్ రాజు, టీసీవై నాయకుడు మురాల సుధాకర్, అత్తిలి మండల అధ్యక్షుడు కృపావరప్రసాద్, దేవరాజ్, ఇరగవరం మండల గౌరవ అధ్యక్షుడు డేవిడ్, అధ్యక్షుడు ఆగమనరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం..

**తణుకు అర్బన్:** తణుకు ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు పీఎన్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలను ఫోన్ 99592 25484 నంబరులో తెలపాలని కోరారు.